
ముసురుకున్న మొంథా

భూపాలపల్లి జిల్లాలో ఎడతెరిపిలేని వాన

- సగటు వర్షపాతం 1.7 సెం.మీ
- పత్తి, వరి పంటలకు నష్టం



భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో నేలవాలిన వరి పంట

భూపాలపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో భూపాలపల్లి జిల్లా అంతటా కనిపించింది. బుధవారం ముసురువాన కురిసింది. మధ్యాహ్నం తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. తుఫాన్ ప్రభావంతో చేతికొచ్చిన పత్తి తడిసిపోయింది. వరి నేలవాలి రైతులకు నష్టం సంభవించింది. వర్షాలు జిల్లాలో పెద్దగా లేకపోయినా ముసురు కమ్ముకోవడంతో సాయంత్రం 4గంటలకే వ్యాపార, వాణిజ్య సముదాయాలన్నీ మూతపడ్డాయి. వ్యక్తిగత పనుల కోసం జిల్లా కేంద్రానికి వచ్చిన ప్రయాణికులు హడావిడిగా ఇళ్లకు వెళ్లిపోయారు. కరీంనగర్, వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తమైంది. ముఖ్యంగా లోయర్ మానేరు పరీవాహక ప్రాంతంలోని మండలాల్లో అధికారులు అప్రమత్తత ప్రకటించారు. మరోవైపు ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరికి కూడా క్రమంగా వరద తీవ్రత పెరుగుతోంది. బుధవారం సాయంత్రానికి జిల్లా వాతావరణ శాఖ సేకరించిన గణాంకాల ప్రకారం జిల్లాలో 1.7 సెంటీ మీటర్ల సగటు వర్షాపాతం నమోదైంది. అత్యధికంగా రేగొండ మండలంలో 6.05 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. పక్కనే ఉన్న కొత్తపల్లి గోరి మండలంలో 5.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే, జిల్లాలో అత్యల్పంగా పలిమెల మండలంలో ఒక సెంటీమీటరు వర్షపాతం నమోదైంది. తుఫాన్ కారణంగా జిల్లాలో ఎక్కడా ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం సంభవించలేదు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు భూపాలపల్లి, ములుగు కలెక్టర్లు గురువారం సెలవు ప్రకటించారు. ఈ విషయాన్ని అన్ని పాఠశాలల యజమానులకు, ప్రధానో పాధ్యా యులకు తెలియజేయాలని ఎంఈవోలకు సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ రాహుల్ శర్మ



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల పట్ల అధికార యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, భూపాలపల్లి, మహదేవపూర్ 1, 2 డివిజన్ల ఇరిగేషన్ అధికారులు, వ్యవసాయశాఖ, జిల్లా వైద్యాధికారులు, ఆస్పత్రుల సమన్వయ అధికారి, విద్యుత్, విద్య, ప్రణాళిక, సంక్షేమశాఖ అధికారులతో ఆయన బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల పెరుగుతున్న వాగులు, నదులు, ప్రవాహాల నేపథ్యంలో అత్యవసర చర్యలకు సిద్ధం కావాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, ప్రమాద సూచన కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. అత్యవసర సేవల సిబ్బంది 24గంటలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్, తాగు నీటి సరఫరా, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. రానున్న రెండు రోజులు మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు ఉన్నాయని తెలిపారు. చెరువుల పరిరక్షణకు స్థానిక శాఖలు చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారులపై నీరు ప్రవహించే ప్రాంతాల్లో బారికేడింగ్ ఏర్పాట్లు చేసి రాకపోకలు నియంత్రించాలని సూచించారు. టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అశోక్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ములుగు జిల్లాలో రెడ్ అలర్ట్

- రోజంతా ఎడతెరిపి లేని వాన
- అప్రమత్తమైన అధికారులు
- కలెక్టర్‌తో మంత్రి సీతక్క టెలీకాన్ఫరెన్స్

ములుగు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ములుగు జిల్లా వ్యాప్తంగా ముసురు వాతావరణంనెలకొంది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపిలేకుండా వాన కురిసింది. ఈ క్రమంలో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. ఎవరూ బయటకు రాకపోవడంతో రోడ్లు వెలవెలబోయాయి. వర్ష ప్రభావంతో పలు చోట్ల దారులు చిత్తడిగా మారాయి.

తుఫాన్ ప్రభావం తీవ్రరూపం దాల్చే అవకాశం ఉండటంతో మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే వాతావరణ శాఖ ములుగు జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. వదలకుండా కురుస్తున్న వర్ష ప్రభావంతో వాగులు, వంకలు, చెరువులు, గోదావరి నిండి ఉప్పొంగే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

మండలాల వారీగా వర్షపాతం

జిల్లాలో నమోదైన వర్షపాతాన్ని అధికారులు ప్రకటించారు. తాడ్వాయి మండలంలో 2.63 సెం.మీల వర్షపాతం, జేడీ మల్లంపల్లి 2.50, ములుగు 2.40, వెంకటాపూర్ 1.03, గోవిందరావుపేట 0.7సెం.మీల, ఏటూరునాగారం 0.85, వాజేడు 0.28, కన్నాయిగూడెం 0.25, వెంకటాపురం 0.23, మంగపేట 0.35సెం.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

మంత్రి సీతక్క టెలీకాన్ఫరెన్స్

మొంథా తుఫాన్ తీవ్ర రూపం దాల్చుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్ నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి కలెక్టర్ దివాకరతో మాట్లాడారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ అత్యవసర చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. చలిగాలులు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు స్వీయ నియంత్రణ పాటించాలన్నారు. రైతులు, పశువుల కాపరులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దన్నారు. ప్రజలు వాగులు, చెరువులు దాటే ప్రయత్నం చేయొద్దన్నారు. తుఫాన్ ప్రభావం తగ్గేంత వరకు అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దన్నారు.



వెంకటాపురం మండలం మల్లాపురంలో నేలవాలిన వరి పంట

మేడారం అభివృద్ధిలో అలసత్వం వహించొద్దు

- పనులను వేగవంతంగా పూర్తి చేయాలి
- నాణ్యతా ప్రమాణాలు పాటించాలి
- సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు



దేవస్థానం పనుల బ్లూ ప్రింట్‌ను పరిశీలిస్తున్న సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు

తాడ్వాయి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మేడారం అభివృద్ధి విషయంలో ఎలాంటి అలసత్వం వహించొద్దని ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి శ్రీనివాసరాజు అన్నారు. కలెక్టర్ దివాకర, ఆర్‌అండ్‌బీ ఈఎస్‌సీ మోహన్ నాయక్‌తో కలిసి ఆయన మేడారంలో బుధవారం పర్యటించారు. ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమ్మక్క- సారలమ్మల దేవస్థానం అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల బ్లూ ప్రింట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం వనదేవతల గద్దెలను దర్శించుకుని తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. పూజారులు అమ్మవార్ల ప్రసాదాలను అందించి ఆయన్ను సన్మానించారు. గద్దెల పరిసరాల్లో ఉన్న ఐటీడీఏ అతిథిగృహంలో అధికారులతో సమావేశమయ్యారు. దేవస్థానంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ప్రాంగణం అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలన్నారు. మేడారానికి వచ్చే ప్రధాన రహదారులకు పలు చోట్ల చేపట్టిన రోడ్లవిస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. పనులను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అమ్మవార్లను దర్శించుకోవడానికి వస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

అభివృద్ధి పనులు శాశ్వతంగా నిలిచేలా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు పనుల పురోగతిని తనకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పూజారులతో మాట్లాడి వారి సమ స్యలు అడిగి తెలుకున్నారు. ఆయన వెంట ఆర్డీవో వెంకటేశ్, ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు, దేవస్థానం అధికారులు, పూజారులు ఉన్నారు.

మహాజాతరకు మెరుగైన విద్యుత్

టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



విద్యుత్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

తాడ్వాయి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మేడారం మహాజాతరకు మెరుగైన విద్యుత్ సరఫరాను అందిస్తామని టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. మేడారంలో చేపట్టిన విద్యుత్ మరమ్మతు పనులను ఆయన బుధవారం పరిశీలించారు. పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మేడారం సబ్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 2026 మహా జాతరకు మెరుగైన విద్యుత్ సరఫరా అందిస్తామని అన్నారు. ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు చేపట్టామని అన్నారు. అదేవిధంగా విద్యుత్ అంతరాయాలు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మరమ్మతుల పనులు సకాలంలో పూర్తి చేసి మహా జాతరలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తాడ్వాయి, మేడారం, కొత్తూరు, నార్లాపూర్ నూతన సబ్ స్టేషన్ల ద్వారా మేడారానికి విద్యుత్ సరఫరా జరుగుతోందన్నారు. ముఖ్యంగా దేవస్థానం, పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలలో విద్యుత్ అంతరాయాలు కలగకుండా చూస్తామన్నారు. ఆయన వెంట డైరెక్టర్ (ఆపరేషన్) టి. మధుసూదన్, డైరెక్టర్ (ప్రొడక్ట్) వి. మోహన్‌రావు, చీఫ్ జనరల్ మేనేజర్ రాజు చౌహాన్, ములుగు ఇన్‌చార్జి ఎస్ఈ మల్సూరు నాయక్ తదితరులు ఉన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



నిందితులను అరెస్టును చూపిస్తున్న ఎస్సై అశోక్

గణపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బంగారు అభరణాల చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని నగరంపల్లికి చెందిన ఆకుల కట్టయ్య ఇంట్లో నాలుగు నెలల క్రితం చోరీ జరిగిందని తెలిపారు. దీనిపై బాధితుడు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన గుర్రం సౌజన్య, ఆమె తండ్రి గుర్రం శ్రీనివాస్ గణపురం వెళ్తుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారించగా రెండు తులాల బంగారు నెక్లెస్‌ను తామే చోరీ చేశామని అంగీకరించినట్లు తెలిపారు. దానిని పరకాలలోని ఓ జువెల్లరి దుకాణంలో విక్రయించేందుకు వెళ్తుండగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

విద్యుత్ షాక్‌తో చిన్నారి మృతి



అంజలి (ఫైల్)

రేగొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాక్‌తో చినారి మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని ఆర్జీతండాలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బానోతు వీరు, ప్రియాంక దంపతుల కూతురు అంజలి(3) ఇంట్లో ఆడుకుంటూ కూలర్ వైర్ ముట్టుకుంది. రెండు వైర్లలో ఒకటి ప్లగ్‌కు ఫిట్ చేసి ఉండగా మరొకటి బయట వేలాడుతూ ఉంది. దానిని చిన్నారి ముట్టకోగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. కళ్ల ముందే ఆడుకుంటూ అలరిస్తున్న బిడ్డ మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. తండ్రి వీరు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ కుమార్ తెలిపారు.



కలెక్టరేట్ ప్రధాన గేటు ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్వీ ధర్నా

కృష్ణకాలనీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్వీ నాయకులు బుధవారం ధర్నా చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు కొల్గూరు దిలీప్‌కుమార్, అమృత అశోక్, కొమ్ము దేవేందర్, ఉల్లి మోహన్, పుట్టపాక నర్సింహా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో కార్తీక సందడి



క్యూలైన్‌లో ఉన్న భక్తులు

మహదేవపూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో బుధవారం సందడి నెలకొంది. కార్తీక మాసం నేపథ్యంలో తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ముందుగా గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయంలోని ఉసిరిక చెట్టు వద్ద లక్ష వత్తుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మహిళలకు పాలు పంపిణీ చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిరికొండ మధుసూదనాచారి

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన సీఎం

శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

హనుమకొండ టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత, సిరికొండ మధుసూదనాచారి ఆరోపించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ సన్మానం పేరిట సభ నిర్వహించడం సరికాదన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక జరుగుతున్న సమయంలో యూసఫ్‌గూడలో సభ పెట్టడం కోడ్‌ను ఉల్లంఘించడమేనన్నారు. సభలో సినీ కార్మికుల పిల్లలకు కార్పొరేట్ విద్య అందిస్తామని, స్కూల్ కోసం భూములు కేటాయించాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. ఇది ఎన్నికలపై ప్రభావాన్ని చూపించే చర్య అన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ సమ్మారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ చింతం సదానందం, బీఆర్ఎస్ నేతలు దాస్యం విజయ్ భాస్కర్, మేడిపల్లి శోభన్ బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ సౌత్ జోన్ మహిళల కబడ్డీ జట్టు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో స్పోర్ట్స్ సెక్రటరీ వెంకయ్య, శ్రీనివాసరెడ్డి

కేయూ క్యాంపస్ అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 29 నుంచి నవంబరు 2 వరకు తమిళనాడు సేలంలోని వినాయక మిషన్ రీసెర్చ్ ఫౌండేషన్‌లో నిర్వహించే 2025-26 సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ కాకతీయ యూనివర్సిటీ మహిళ కబడ్డీ పోటీలకు జట్టు ఎంపికైంది. ఈ మేరకు బుధవారం కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య ఎంపిక క్రీడాకారుల వివరాలను వెల్లడించారు. ఎంపికైన వారిలో సీహెచ్. వైష్ణవి, (తాళ్ళపద్మావతి ఫార్మసీ కళాశాల, వరంగల్), డి .సునీత (టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ, మహబూబాబాద్), వి.సంజన, (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నర్సంపేట), బి.భార్గవి, (ఎంజేపీటీబీసీ కళాశాల, ఖమ్మం), ఎస్.అక్షర, (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), పి.శిరీష, (వీఐపీఎస్, బొల్లికుంట), జె.జ్యోతి (ఎంజేపీటీడబ్ల్యూఆర్‌డీసీ కళాశాల, స్టేషన్‌ఘన్‌పూర్), బి.విద్య శ్రీ, (టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ కళాశాల, కొత్తగూడెం), జి.కావ్యశ్రీ ,(టీజీడబ్ల్యూఆర్‌డీసీ,ఖమ్మం) బి.దివ్య, (ఎల్‌బీ కళాశాల, వరంగల్), పి.శారద, (యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఖమ్మం), వై. అనిత, (వీసీపీఈ కళాశాల, బొల్లికుంట), జి. హారిక, (వాగ్దేవి డిగ్రీ కళాశాల, హనుమకొండ), ఎస్.అఖిల, టీజీటీబ్ల్యూఆర్‌డీసీ కళాశాల, దమ్మపేట) ఎంపికైనట్లు వెంకయ్య వెల్లడించారు. జట్టుకు కోచ్‌గా కిట్స్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, మేనేజర్‌గా హనుమకొండ వాగ్దేవి డిగ్రీ కళాశాల పీడీ డాక్టర్ పి.అజయ్‌లు వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.

ఏనుమాముల మార్కెట్‌కు 4 రోజులు సెలవు

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ గ్రేడ్-2 కార్యదర్శి రామోజు రాము బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మొంథా తుఫాన్ సందర్భంగా గురు, శుక్రవారాలు సెలవు, శనివారం మార్కెట్ యార్డు బంద్, ఆదివారం సాధారణ సెలవు. తిరిగి సోమవారం మార్కెట్లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని తెలిపారు.

తల్లి త్యాగానికి తీరని విషాదం

● తల్లి ప్రాణం సగం కోల్పోయినా దక్కని ఫలితం ● కిడ్నీ ఇచ్చిన తల్లి త్యాగం వృథా ● వడ్లకొండలో విషాద ఛాయలు

పర్వతగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తాను బతుకకపోయినా, తన కొడుకు మాత్రం బతకాలనే తల్లి ప్రేమకు సాటిలేదు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన చింతకాయల సోమక్క తన కుమారుడు చింతకాయల నాగరాజు(33)కు ప్రాణం కోసం తానే కిడ్నీ ఇచ్చి తల్లి ప్రేమకు అర్థం చెప్పింది.

వివరాల్లోకెళితే పర్వతగిరి మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన చింతకాయల జంపయ్య-సోమక్కలకు ముగ్గురు కొడుకులు. కాగా, రెండవ కుమారుడు చింతకాయల నాగరాజు గత 7 సంవత్సరాల నుంచి తన భార్య స్వప్న, కూతురు అక్షరశ్రీతో హైదరాబాదులో ఒక చికెన్ షాపులో పనిచేస్తూ జీవిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యం పాలైన నాగరాజు వైద్య పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి వెళ్లగా, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు.. రెండు కిడ్నీలు చెడిపోయాయని, అవి చివరి స్టేజిలో ఉందని వైద్యులు తెలిపారు. దీంతో ఎవరైన దాతలు కిడ్నీలు ఇస్తే తప్ప బతికే అవకాశం లేదని వైద్యులు తెలిపారు. కుటుంబంలో అందరి కిడ్నీలను పరీక్ష చేయగా తల్లి సోమక్క కిడ్నీ తనకు సరిపోతుందని వైద్యులు తేల్చారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 లక్షల అప్పులు చేసి చెల్లించగా ఆపరేషన్ చేసి కిడ్నీ మార్పిడి చేశారు. హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ చేయ గా, ఇంటికి వచ్చిన నాగరాజు తిరిగి మళ్లీ తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. దీంతో వెంట నే హైదరాబాదులోని అదే హాస్పిటల్‌కు ట్రీట్మెంట్ కోసం వెళ్తుండగానే మార్గం మధ్యలో చనిపోయాడు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా, కుటుంబం అప్పులపాలై, కొడుకుకు కిడ్నీ ఇచ్చి బతికించుకోలేకపోయిన తల్లి, భార్య, కూతురు రోదనలతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, ప్రభుత్వం తన కొడుకు కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు.



చింతకాయల సోమక్క చింతకాయల నాగరాజు(ఫైల్)

‘బుగులోని’ అభివృద్ధి పనుల్లో జాప్యం

● ఇంకా వారం రోజుల్లో బుగులోని బ్రహ్మోత్సవాలు ప్రారంభం ● కనిపించని పురోగతి

రేగొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని బుగులోని వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఏటా కార్తీక మాసంలో ఈ జాతరను నిర్వహించడం ఆనవాయితీ. ఈసారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఇప్పటికే ప్రకటించారు. ఇందులో భాగంగా ఆయన చొరవతో అభివృద్ధి పనులకు భారీ నిధులు మంజూరయ్యాయి. జాతర ప్రారంభం కల్లా ఈ పనులు పూర్తి చేయాలని ఆయన సంకల్పించారు. అయితే.. అందుకు అనుగుణంగా పనుల్లో వేగం కనిపించడం లేదు. నవంబరు 4 నుంచి బ్రహ్మోత్సవాలు జరగనుండగా అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించడం లేదు. ఎక్కడి పనులు అక్కడే మిగిలి ఉన్నాయి. ఈ జాతర కల్లా అవి పూర్తికావడం అనుమానస్పదమేనని సర్వత్రా అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రూ. 2.90 కోట్లతో అభివృద్ధి

బుగులోని వెంకటేశ్వర స్వామి జాతర అభివృద్ధి పనులకు రూ. 2 కోట్ల 90 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో మెట్ల వెడల్పు, కోనేరు, బావి, కల్యాణ మండపం, మరుగుదొడ్లు, కల్యాణ కట్ట నిర్మాణం తదితర పనులు చేపట్టారు. జాతర సమీపిస్తున్న ఆ పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. జాతరకు వచ్చే భక్తులు వెంకటేశ్వర్లపల్లి, పాండవుల గుట్ట, తిరుమలగిరి, రావులపల్లి, జగ్గయ్యపేట గ్రామాల నుంచి ఐదు మార్గాల మీదుగా వస్తారు. జగ్గయ్యపేట నుంచి జాతరకు ఉన్న మార్గంలో బీటీ రోడ్డు వేయడానికి కంకర పోసి రోలింగ్ చేస్తున్నారు. అయితే.. తిరుమలగిరి, రావులపల్లి, పాండవుల గుట్ట మార్గాల్లో గుంతలతో రోడ్లు ప్రమాదరంగా ఉన్నాయి. ఒక చోట రోడ్డు పక్కనే వ్యవసాయ బావి ఉంది. దీనికి రక్షణ గోడ లేదు. ఆ రహదారి మీదుగా ప్రయాణించే భక్తులకు ఇది ప్రమాదకరంగా ఉంది. జాతర ప్రారంభం కావడానికి ఇంకా వారం రోజులు కూడా లేవు. అప్పటి వరకు ఈ పనులు పూర్తవుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది.


జగ్గయ్యపేట మార్గంలో కంకర పోసి వదిలేసిన రోడ్డు


కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న రావులపల్లి రోడ్డు

ప్రభుత్వ ఉద్యోగులకు సంగీత నృత్య పోటీలు

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): యేటా ఐఏఎస్ అధికారులకు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లుగా.. ఈసారి రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు సంగీత నృత్య పోటీలను నిర్వహిస్తున్నట్లు సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నర్సింహారెడ్డి తెలిపారు. ఆసక్తి గల ప్రభుత్వ ఉద్యోగులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. నవంబరు 6,7 తేదీల్లో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పోటీలను నిర్వహిస్తామన్నారు. కర్ణాటక, హిందూస్థానీ, జానపద, గాత్ర కచేరి, కిట్ అంశాలకు సంబంధించిన పోటీలు నవంబరు 6, జానపద, శాస్త్రీయ, నృత్య పోటీలు నవంబరు 7వ తేదీన నిర్వహింపజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే ఉద్యోగులకు ఓడీ సౌకర్యంతోపాటు విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. సంగీత అంశాల్లో పాల్గొనేందుకు తమ పేర్లను వరంగల్ ప్రభుత్వ సంగీత విద్యారణ్య కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్‌కు 98496 41839, నృత్య అంశాలకు సంబంధించి నీరాజాక్షి 97044 66499 నెంబర్ల ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సాంస్కృతిక శాఖ సంచాలకులు నర్సింహారెడ్డి సూచించారు.

పత్తిని ఆరబెట్టి తీసుకురావాలి

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : అధిక తేమ వల్ల మద్దతు ధరలో కోత విధించకుండా ఉండాలంటే రైతులు తమ పత్తిని బాగా ఆరబెట్టిన తర్వాతే సీసీఐ కేంద్రానికి తీసుకురావాలని సీసీఐ వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ మోహిత్‌శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తికి మద్దతు ధర కల్పించేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఉమ్మడి వరంగల్ జిల్లాలో 60 కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. పత్తిలో 8 శాతం తేమ ఉంటే మద్దతు ధర క్వింటాల్‌కు రూ.8110లు పలుకుతుందని, తేమ శాతం పెరుగడం వల్ల ధరలో కోత పడుతుందన్నారు. అది కూడా తేమ 12 శాతం మించితే సీసీఐ కొనుగోలు చేయదని స్పష్టం చేశారు. అందుకే పత్తిలో తేమ శాతం అధికంగా ఉండకుండా పత్తిని ఆరబెట్టిన తర్వాతే అమ్మకానికి తీసుకురావాలని మోహిత్‌శర్మ ఆ ప్రకటనలో కోరారు.

భద్రకాళి దేవస్థానానికి రండి

మట్టెవాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మ విజయ యాత్రలో భాగంగా హైదరాబాద్‌లోని నల్లకుంట శంకర మఠానికి వచ్చిన శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి విధు శేఖర భారతిస్వామిని బుధవారం భద్రకాళి దేవస్థాన ప్రధాన అర్చకుడు భద్రకాళి శేషు, వరంగల్ వాసవి క్లబ్ అధ్యక్షుడు, భద్రకాళి దేవస్థానం ధర్మకర్త తొనుపునూరి వీరన్న ఆధ్వర్యంలో కలిశారు. భారతి స్వామికి అమ్మవారి శేషవస్త్రాలు, చిత్రపటాన్ని అందజేశారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రకాళి దేవస్థానానికి రావాల్సిందిగా కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో భద్రకాళి దేవస్థాన ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, ఓరుగంటి పూర్ణ, మోతుక్కూరి మయూరి, రాము పాల్గొన్నారు.

మునిగిన నగరం

● నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు ● బాధితులను పునరావాస కేంద్రాలకు తరలింపు ● రక్షణ చర్యలు చేపడుతున్న అధికారులు ● వరంగల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షం కారణంగా వరంగల్ నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు కాలనీలో వరద నీటిలో మునిగిపోయాయి. జన సంచారం అతలాకుతలమైంది. ఇక బుధవారం కురిసిన భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తం అయ్యింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వర్షాలకు నగంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, షాపులు, ఇండ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పరేషన్ పరిధిలో ఇప్పటి వరకు 15 కాలనీలలో ఇండ్లలోకి వర్షపునీరు చేరుకున్నట్టు అధికారులు గుర్తించారు.

కాగా, బల్దియా అధికారులు రక్షణ చర్యలు చేపడుతున్నప్పటికీ నగరంలో చాలాచోట్ల డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చకపోవడం, నాలాల శుభ్రత దీర్ఘకాలిక సమస్యగా ఉండిపోవడంతో వర్షాలు కురిసిన ప్రతీసారి పాత సమస్యే ఉత్పన్నమవుతోంది. భారీ వర్షాలకు ఇండ్లు జలమయమవ్వడం, ప్రజలు వరద ముంపునకు గురికాక తప్పదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రధానంగా వరంగల్ ట్రైసిటీస్ పరిధిలోని కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లోని పలు కాలనీలు నీటమునుగుతున్నాయి. లోతట్టు ప్రాంతాలలో భూ కబ్జాదారులు రోడ్లు, డ్రైనేజీలు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో ప్రతీసారి కాలంతో పని లేకుండా వర్షం కురిసినప్పడల్లా ఈ సమస్య ఎదురవుతోందనే విమర్శలు వస్తున్నాయి. 2020 నుంచి ఏటా భారీవర్షాలకు ఇండ్లలోకి వర్షపు నీరు చేరుకుంటున్నప్పటికీ అధికారులు అప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నారే కానీ శాశ్వత పరిష్కారం చూపడం లేదని బల్దియా అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నీట మునిగిన ప్రాంతాలు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరంగల్ నగరంలో పలు కాలనీలలో ఇండ్లలోకి నీరు చేరినట్టు జీడబ్ల్యూఎంసీ అధికారులు గుర్తించారు. త్వరితగతిన సహాయక చర్యలు ప్రారంభించినట్టు సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి తెలిపారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాలైన హనుమకొండ, వరంగల్ నగరంలోని పలు ప్రాంతాలతో పాటు సాయిగణేశ్ కాలనీ, గాంధీనగర్, డీకేనగర్, లెనిన్ నగర్, వివేకానంద కాలనీ, శివనగర్, ఎస్టీఆర్ నగర్, ఎంఎన్ నగర్, సీఎస్ఆర్ గార్డెన్, కొత్తబస్‌స్టేషన్, గోకుల్‌నగర్, శాంతినగర్, కాశిబుగ్గ, రంగశాయిపేట, కరీమాబాద్, ఎస్ఆర్ఆర్ తోట, ఉర్సుగుట్ట, టీకే నగర్, మైసయ్యనగర్, గోపాలపురం, తెలంగాణ జంక్షన్, రంగంపేట, ఎన్‌జీవోఎస్ కాలనీ, పోచమ్మకుంట, ఎల్‌వీఆర్ కాలనీ, కొత్తవాడ, కాపువాడ, పాతబీటుబజార్, వరంగల్ చౌరస్తా, బట్టల బజార్, అండర్ రైల్వేగేట్ ప్రాంతాలతో పాటు పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాలలో నీరు ఇండ్లలోకి చేరుకున్నాయి. కాగా, ఇండ్లలోకి వర్షపునీరు చేరడంతో జీడబ్ల్యూఎంసీ డీఆర్ఎఫ్, శానిటేషన్ సిబ్బంది స్పందించి నీటిలో చిక్కి ఇండ్లలో ఉన్న వారిని గుర్తించి పునరావాలస కేంద్రాలకు తరలించారు. ఇప్పటివరకు సుమారు 280మంది నిరాశ్రయులను పునరావాస కేంద్రాలకు తలించినట్టు శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్ వెల్లడించారు. శంభునిపేట ప్రభుత్వ హైస్కూల్, బీరన్నకుంట హైస్కూల్, శుభం గార్డెన్, గుజరాత్ మార్వాడీ సెంటర్, శ్రీ రాజరాజేశ్వరి గార్డెన్ ఐదుచోట్ల, హనుమకొండలో రెండుచోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి నగర పాలక సంస్థ సహకారంతో ఉచిత బోజన, వసతి కల్పిస్తున్నారు. బుధవారం ఉదయం 800మందికి అల్పాహారం అందించినట్టు అధికారులు తెలిపారు.


పునరావాస కేంద్రాల్లో ప్రజలతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి


వికాస్‌నగర్‌లో కూలిన వృక్షాన్ని తొలగిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

గ్రేటర్ అధికారుల చర్యలు

వరంగల్ నగరంలో కురుస్తున్న వర్షాలకు నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ప్రజలకు సూచించారు. మంగళవారం రాత్రి నుంచి కురిసిన వర్షాలకు నగరంలో చాలాకాలనీలతో పాటు ఇండ్లలోకి నీరు చేయడంతో కమిషనర్ అధికారులను అప్రమత్తం చేశారు. పర్యటించారు. శానిటేషన్‌తో పాటు టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులను సమన్వయం చేసుకుని పలు కాలనీలలో సందర్శించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి ఆత్మస్థైర్యాన్ని నింపారు. సాయిగణేశ్ కాలనీ, డీకేనగర్, లెనిన్‌నగర్, అగర్తల చెరువు, మైసయ్యనగర్, గిరిప్రసాద్ కాలనీ, పద్మనగర్, శాకరాసికుంట ప్రాంతాల్లో శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది వర్షం సైతం లెక్క చేయకుండా పర్యటించి వరద ముంపుకు గల కారణాలను తెలుసుకున్నారు. ఇంకా మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, ప్రమాదపుటంచులో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ సంబంధిత అధికారులను, ప్రజలను అధికారులను ఆదేశించారు. కాగా, నగరంలో ఏడు పునరావాస కేంద్రాలలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. వర్షాకాలంలో పిల్లలు బయటకు, చేపలకు, ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బల్దియా ప్రధాన కార్యాయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, అత్యవసర సమయంలో టోల్‌ఫ్రీ నెంబర్‌కు 1800 425 1980, 9701999676 ఫోన్‌చేయాలని కమిషనర్ సూచించారు.

టోల్‌ఫ్రీని వాడుకోవాలి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

ఐసీసీసీ నుంచి పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో ఇబ్బందులు పడుతున్న నగర ప్రజలు టోల్‌ఫ్రీ నెంబర్‌కు 1800 425 1980 ఫోన్‌చేసి సహాయం పొందాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ కోరారు. రెండు రోజులుగా భారీ వర్షాల నేపథ్యంలో వరంగల్ నగరంలో నెలకొన్న పరిస్థితిని వరంగల్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఐసీసీసీ (ఇంటిగ్రేటెడ్ కమాంగ్ కంట్రోల్ రూమ్) నుంచి బుధవారం నేరుగా పరిశీలించారు. బల్దియా శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. వరంగల్ నగరంలో ఎక్కడైనా నీట మునిగిన ప్రాంతాలు, తెరుచుకున్న మ్యాన్‌హోల్స్ ప్రాంతాలు, డ్రైనేజీ అవరోధాలను తక్షణమే గుర్తించాలన్నారు. వర్షాలవల్ల ప్రజలకు ఇబ్బందులు ఏర్పడకుండా సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో కాలనీలో పర్యటించాలన్నారు. అవసరమైతే అత్యవసర సిబ్బంది యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి వర్షాపాతం స్థితి, ట్రాఫిక్ అప్‌డేట్స్, ఫీల్డ్ ఎస్పాన్స్ టీమ్స్ పని తీరును ఐసీసీసీ నుంచి వీక్షించారు. వర్షాలవల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనవసర ప్రయాణాలు మానుకోవాలని కమిషనర్ ప్రజలకు సూచించారు.


ఐసీసీసీ నుంచి పరిశీలిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

మానుకోట ఆగమాగం

- ఎడతెరిపిలేని భారీ వర్షం
- నీటమునిగిన డోర్నకల్ రైల్వేలైన్
- నిలిచిన రైళ్లు.. ప్రయాణికుల ఇక్కట్లు
- పొంగుతున్న వాగులు.. రాకపోకలు బంద్



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో నేలవాలిన వరి పంట

మహబూబాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో మహబూబాబాద్ జిల్లాలో ఎడతెరిపిలేని భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఏకధాటిగా.. కుండపోతగా వర్షం కురుస్తుండడం, బలమైన ఈదురుగాలులు వీస్తుండడంతో అతలాకుతలమైంది. బుధవారం ఉదయం 6.10 గంటలకు ప్రారంభమైన వర్షం భారీ తుఫానుగా మారి సాయంత్రం వరకు కురుస్తూనే ఉంది. డోర్నకల్ రైల్వే లైన్‌పై ప్లాట్ ఫామ్ ఎత్తు వరకు వరదనీరు చేరడంతో ఆ ప్రాంతమంతా చెరువును తలపించింది. డోర్నకల్, గుండ్రాతిమడుగు, మహబూబాబాద్, తాళ్లపూస పల్లి స్టేషన్‌లలో రైళ్లు గంటలతరబడి నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆదేశాలతో పోలీసులు, బిస్కెట్లు, తాగునీరు అందించగా స్వచ్ఛంద సేవా సంస్థలు పండ్లు, బిస్కెట్‌లను పంపిణీ చేశారు. సాయంత్రం పలు రైళ్లను దారి మళ్లించారు. కలెక్టర్ ఆదేశాలతో డీఈవో పాఠశాలలకు సెలవు ప్రకటించారు.



కొత్తగూడ గుంజేడు ముసలమ్మ గుడి వద్ద రోడ్డుపై కూలిన భారీ వృక్షం

దంతాలపల్లి, పెద్దముప్పారంలో వద్ద పాలేరు పొంగి ప్రవహిస్తుండడంతో సూర్యాపేటకు రాకపోకలు నిలిచిపోయాయి. గార్ల వద్ద పాకాల వాగు పొంగి ప్రవహిస్తుండడంతో మద్దివంచ, రాంపురం, ఇతర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కేసముద్రం మండలం అర్పనపల్లి వద్ద వట్టివాగు బ్రిడ్జిపై నుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో గూడూరు, కాట్రపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బొగ్గులవాగు వద్ద, ఈద్ల వద్ద వరద నీరు ప్రవహిస్తుండడంతో కల్వల, కేసముద్రం, ఇనుగుర్తి రాకపోకలు నిలిచిపోయాయి. గూడూరు వద్ద పాకాల వాగు పొంగి ప్రవహిస్తుండడంతో కేసముద్రం, నెక్కొండలకు రాకపోకలు నిలిచిపోయాయి. మొక్కజొన్న, పత్తి, వరి పంటలు నేలవాలి దెబ్బతిన్నాయి. కాగా, మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో ఆగిన కృష్ణా ఎక్స్‌ప్రెస్, గుండ్రాతిమడుగు స్టేషన్‌లో నిలిచిన కోణార్క్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం మళ్లీ వెనుకకు దారి మళ్లించారు. డోర్నకల్ స్టేషన్‌లో నిలిచిన గోల్కొండ ఎక్స్‌ప్రెస్ స్టేషన్‌లో నిలిపివేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా స్టేషన్లలో రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. డోర్నకల్‌లో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం4 గంటల వరకు 150.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

భూపాలపల్లి జిల్లాలో స్వల్పం

భూపాలపల్లి (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాలో బుధవారం ముసురువాన కురిసింది. మధ్యాహ్నం తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో జిల్లా వ్యాప్తంగా జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. తుఫాను ప్రభావంతో చేతికొచ్చిన పత్తి తడిసిపోయి రైతులకు అపార నష్టం సంభవించింది. కరీంనగర్, వరంగల్ జిల్లాలో భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ముఖ్యంగా లోయర్ మానేరు పరీవాహక ప్రాంతంలోని మండలాల్లో అధికారులు అప్రమత్తత ప్రకటించారు. మరోవైపు ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరికి కూడా క్రమంగా వరద తీవ్రత పెరుగుతోంది. బుధవారం సాయంత్రానికి జిల్లా వాతావరణ శాఖ సేకరించిన గణాంకాల ప్రకారం జిల్లాలో 1.7 సెంటీమీటర్ల సగటు వర్షాపాతం నమోదైంది.

ములుగు జిల్లాలో ముసురు

ములుగు (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ములుగు జిల్లా వ్యాప్తంగా ముసురు వాతావరణం నెలకొంది. బుధవారం ఎడతెరిపిలేకుండా వాన కురిసింది. ఈ క్రమంలో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. ఎవరూ బయటకు రాకపోవడంతో రోడ్లు వెలవెలబోయాయి. ఇప్పటికే వాతావరణ శాఖ ములుగు జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. వాగులు, వంకలు, చెరువులు, గోదావరి నిండి ఉప్పొంగే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. రైతులకు నష్టం జరగకుండా వ్యవసాయ, మార్కెటింగ్, రెవెన్యూ, డీఆర్డీవో, సంబధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ దివాకర ఆదేశాలు జారీ చేశారు. మొంథా తుఫాన్‌పై అధికారులతో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క హైదరాబాద్ నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అప్రమత్తంగా ఉండాలన్నారు.

జనగామ జిల్లాలో..

జనగామ (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ జనగామ జిల్లాను అతలాకుతలం చేసింది. జిల్లా అంతటా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. భారీ వర్షం కారణంగా జిల్లాలో చాలా ప్రాంతాల్లో వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. లోతట్టు ప్రాంతాల్లోని వరి, పత్తి పంటలు వర్షపు నీటిలో పూర్తిగా మునిగిపోయాయి. కోత దశకు వచ్చిన వరి, తీత దశకు వచ్చిన పత్తి పంట నీట మునగడంతో అన్నదాతకు తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లాలో బుధవారం ఉదయం 9 గంటల వరకు సాధారణ పరిస్థితులు ఉండగా 9 దాటిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. భారీ వర్షాల కారణంగా జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పినప్పటికీ కింది నుంచి నీరు చేరి ధాన్యం తడిసిపోయింది. కొన్నిచోట్ల లోతట్టు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు నీటి మునిగాయి. పలు చెరువులు మత్తళ్లు దుంకుతుండగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కల్వర్టుల వద్ద వాగులు పొంగి పొర్లుతుండడంతో పోలీసులు వాహనాల రాకపోకలను నిలిపి వేసి దారి మళ్లించారు. భారీ వర్షం కారణంగా జనగామ జిల్లాకేంద్రంలోని హైదరాబాద్ రోడ్డు పూర్తిగా నీట మునిగింది. కాగా.. జిల్లాలోని పాలకుర్తి మండలం గూడూరులో అత్యధికంగా 23.5 సెం.మీ వర్షపాతం నమోదైంది.



రఘునాథపల్లిలోని జాతీయ రహదారిపై నిలిచిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, పోలీసులు



హనుమకొండ చౌరస్తాలో మునిగిన ద్విచక్ర వాహనం



జలమయమైన హనుమకొండ బస్టాండ్

ముంచెత్తిన 'మొంథా'

వరంగల్, హనుమకొండ జిల్లాలు అతలాకుతలం

- చెరువులుగా కాలనీలు, కాలువలుగా రహదారులు
- తుఫాన్‌తో అస్తవ్యస్తం, లోతట్టు ప్రాంతాలు జలమయం
- కుండపోతతో స్తంభించిన జన జీవనం
- ఇళ్లలోకి ప్రవేశించిన వరద నీరు
- పర్వతగిరిలో అత్యధికంగా 340 మి.మీ. వర్షపాతం
- పలు రైళ్లు రద్దు, మరికొన్ని దారి మళ్లింపు



జలమయమైన వరంగల్‌లోని శివనగర్

హనుమకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ మొంథా ప్రభావం హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోనూ తీవ్ర ప్రభావం చూపింది. రెండు జిల్లాల్లో ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తుంది. ఆకాశానికి చిల్లు పడిందా ? అన్న రీతిలో ఎడతెరిపి లేకుండా కుండపోతగా వర్షం పడుతూనే ఉంది.

వరంగల్ జిల్లాలో అత్యధికంగా వర్షం కురిసింది. పర్వతగిరి మండలం కల్లెడలో అత్యధికంగా 340 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది. సంగెం, నెక్కొండ, ఖిలా వరంగల్, పాలకుర్తి, వర్ధన్నపేట, భీమదేవరపల్లి మండలాల్లోనూ 200 మి.మీ. పైన వర్షం పడింది.

అతలాకుతలం

ఈ రెండు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తుండడంతో ఈదురుగాలులతో అనేక ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. వరద బీభత్సం సృష్టించాయి. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. అనేక ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవహించింది. కొన్ని చోట్ల వరదల్లో వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు కొట్టుకుపోయాయి. వస్తువులన్నీ నీటమునిగి ముద్దయ్యాయి. గుడిసెవాసుల పరిస్థితి దయనీయంగా మారింది. భారీ వర్షాలకు చాలా చోట్ల గుడిసెలు కొట్టుకుపోయాయి. పలు చోట్ల నేలమట్టమయ్యాయి. అనేక మంది నిరాశ్రయులయ్యారు. వరదల్లో చిక్కుకొని విలవిల్లాడారు. వీరందరిని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. అకాల వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. ఉదయం నుంచి ప్రజలు ఎవరూ అడుగు బయటపెట్టలేదు. నగరంలోని రోడ్లన్నీ చెరువులుగా మారిపోయాయి. రోడ్లపై పార్కింగ్ చేసిన కార్లలో కొన్ని వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. మరికొన్ని పూర్తిగా మునిగిపోయాయి. స్కూళ్లకు సెలవులు ఇవ్వకపోవడంతో విద్యార్థులు వర్షంలోనే తడుస్తూ ఇళ్లకు తిరిగి వెళ్లడం కనిపించింది.

భారీ వర్షాలకు అనేక చోట్ల చేతికివచ్చిన పంటలు నేలపాలయ్యాయి. పొలాల్లో భారీ ఎత్తున వరద నీరు ప్రవహించడంతో పంటలు నీటమునిగాయి. వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆరబెట్టిన వరి ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి.

భారీ వర్షాల కారణంగా వరంగల్ జిల్లాలో ఒకరు మృతి చెందారు. దుగ్గొండి మండలంలోని గిర్ని బావి ప్రధాన రహదారి వద్ద బైక్‌పై వెళ్తున్న లూనావత్ రాజేందర్ చెట్టును ఢీకొట్టి మృతి చెందాడు. భారీ వర్షాల వల్ల పలు రైళ్లు నిలిచిపోయాయి. డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో పట్టాలపైకి భారీగా వరద నీరు చేరింది. దీనితో స్టేషన్‌లో గోల్కొండ, ఎక్స్‌ప్రెస్, వరంగల్-విజయవాడ మార్గంలో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. వరంగల్ రైల్వే స్టేషన్‌లో గుంటూరు ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ హౌరా ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, మహబూబాబాద్ స్టేషన్‌లో కోణార్క్, కృష్ణ, మధిర స్టేషన్‌లో షిరిడి ఎక్స్‌ప్రెస్, పందిళ్లపల్లి (ఖమ్మం)లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. దీనితో పాటు పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భారీ వర్షాల నేపథ్యంలో హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టరేట్లలో ప్రజలకు అత్యవసర సేవలు అందించడానికి కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు.

పలుచోట్ల వర్షపాతం

వరంగల్ జిల్లాలోని పర్వతగిరి మండలంలో కల్లెడలో అత్యధికంగా 340 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, సంగెం మండలంలో 252.3, నెక్కొండలో 246.3, ఖిలా వరంగల్‌లో 237, పాలకుర్తిలో 235.8, సంగెంలో 234.8, వర్ధన్నపేటలో 228, నెక్కొండలో 195.5, వరంగల్‌లో 188, గీసుకొండలో 185 చెన్నారావుపేటలో 173.5 మి.మీ హనుమకొండ జిల్లాలోని భీమదేవరపల్లి మండలంలో అత్యధికంగా 213.8 మి.మీ., హసన్‌పర్తిలో 179 మి.మీ., ధర్మసాగర్‌లో 177.8, దామెరలో 171.5, ఐనవోలులో 144.8, కాజీపేటలో 137.8 మి.మీ వర్షపాతం నమోదైంది.



వర్షం నీటితో నిండిన వరంగల్ రైల్వేస్టేషన్

కొట్టుకుపోయిన గొర్రెలు.. మృతి చెందిన కోళ్లు

రాయపర్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మొరిపిరాల గ్రామంలో లింగాల కుంట చెరువు మత్తడి పోస్తుండగా 15 గొర్రెలు వరదలో కొట్టుకుపోయి మృతి చెందాయి. జోగు అశోక్, చేగురి శ్రీశైలంలకు చెందిన గొర్లు కాగా, మరికొన్ని గల్లంతవడంతో గ్రామస్థుల సహకారంతో గాలిస్తున్నారు. అలాగే మైలారంలో బిల్లా దేవేందర్ రెడ్డి కోళ్ల ఫారంలో వర్షానికి దాణా తడిసిపోయింది. అదే దాణా తిని సుమారు 5,500 కోళ్లు మృత్యువాతపడ్డాయి.

ఉపాధ్యాయులకు తప్పిన ప్రమాదం

మండలంలోని కొత్తూరు ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న కొంక అనురాధ విధులు ముగించుకుని మధ్యాహ్నం కారులో ఇంటికి తిరిగి వెళ్తుండగా, కురుస్తున్న వర్షానికి గ్రామ శివారులో రోడ్డుపై వరద ఉధృతికి కారు పొలాల్లోకి వెళ్లిపోయింది. అప్పటికే కారులో ఐదుగురు ఉపాధ్యాయులు ఉండగా భారీ ప్రమాదం తప్పింది. స్థానికులు ట్రాక్టర్ సహాయంతో కారును బయటకు తీసి పంపించారు.

వర్షం నీటిలో జారి పడి వృద్ధురాలి మృతి

డోర్నకల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ఉయ్యాలవాడ గ్రామ శివారు సత్యతండాలో ఇంటిలోకి చేరిన వర్షపు నీటిలో ప్రమాదవశాత్తు జారిపడి వృద్ధురాలు జువ్వల రోషమ్మ (70) మృతి చెందింది. బుధవారం మొంథా తుఫాన్ ఎఫెక్ట్‌తో కురిసిన భారీ వర్షానికి తండాలో వర్షపు నీరు నిలిచింది. ఈక్రమంలో రోషమ్మ ఇంట్లోకి వర్షపు నీరు చేరింది. అందులో ప్రమాదవశాత్తు వృద్ధురాలు రోషమ్మ జారి అక్కడికక్కడే మృతి చెందింది. ఇంట్లో ఎవరూ లేక పోవడంతో చుట్టు పక్కల వారు చూసే సరికి అప్పటికే రోషమ్మ మృతి చెందింది. ఈ విషయాన్ని తండావాసులు డోర్నకల్ పోలీసులకు సమాచారం అందించారు.

నీట మునిగిన సబ్‌స్టేషన్



బాల సముద్రం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిలిచిన వర్షం నీరు

రాంనగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో హనుమకొండ బాలసముద్రంలోని 33బై11 కేవీ సబ్‌స్టేషన్ నీట మునిగింది. పవర్ ట్రాన్స్‌ఫార్మర్, ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లు ఎత్తులో ఉండటంతో వినియోగదారులకు ఎలాంటి అంతరాయం కలగలేదని కలగలేదని హనువకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. వినియోగదారులు తడిచేతులతో విద్యుత్ పరికరాలను ముట్టుకోరాదన్నారు.

న్యాయశాస్త్ర సెమిస్టర్ పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో అక్టోబరు 30న జరగాల్సిన న్యాయశాస్త్ర విభాగం సెమిస్టర్ పరీక్షలను భారీ వర్షాల నేపథ్యంలో వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎమ్మీ అసీం ఇక్బాల్‌లు బుధవారం ప్రకటించారు. మూడేళ్ల కోర్సుల ఎల్ఎల్‌బీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు, అలాగే ఐదేళ్ల ఎల్ఎల్‌బీ ఎనిమిదో సెమిస్టర్ పరీక్షలు, ఇంజనీరింగ్ బీటెక్ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు స్పష్టం చేశారు. ఆయా పరీక్షల రీషెడ్యూల్ తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని వెల్లడించారు. మిగిలిన పరీక్షలన్నీ యథావిధిగా గతంలో ప్రకటించిన షెడ్యూల్ మేరకు జరుగుతాయని పేర్కొన్నారు.

పలు రైళ్లు రద్దు.. మరికొన్ని దారి మళ్లింపు

తుఫాన్ ప్రభావంతో రైల్వే శాఖ నిర్ణయం

కాజీపేట/గిర్మాజీపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌పై వరద నీరు చేరడంతో రైల్వే శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. సికింద్రాబాద్, విజయవాడ, విశాఖపట్నం రూట్లలో పలు రైళ్లను రద్దు చేసి, మిగతా రైళ్లను దారి మళ్లించారు. దీంతో రైల్వే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇంటర్‌సిటీ, ఈస్ట్‌కోస్ట్ రైళ్లను వరంగల్ రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో కృష్ణా ఎక్స్‌ప్రెస్, డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో గోల్కొండ్ ఎక్స్‌ప్రెస్, ఉండ్రాతిమడుగు రైల్వే స్టేషన్‌లో కోణార్క్, రైళ్లను నిలిపివేశారు.

రద్దయిన రైళ్ల వివరాలు

(12705 /06) గుంటూర్ - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, అప్ అండ్ డౌన్ (6778) విజయవాడ - డోర్నకల్ ప్యాసింజర్, (67766) డోర్నకల్ - కాజీపేట, (07001) చర్లపల్లి - తిరుపతి అప్‌అండ్ డౌన్, రైళ్లు బుధ, గురువారల్లో రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. (12131) దాదర్ -సాయినగర్‌ల మధ్య షిర్డీ ఎక్స్‌ప్రెస్‌ను కాజీపేటలో నిలిపివేసి తిరిగి సికింద్రాబాద్ పంపించారు. కాగా, కాజీపేట రైల్వే స్టేషన్‌లో రైల్వే ప్రయాణికుల కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు.

పాక్షికంగా రద్దయిన రైళ్లు

(12706) సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వరంగల్ - గుంటూరు మధ్య రద్దుచేశారు. 17406 ఆదిలాబాద్ - తిరుపతిల మధ్య నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్ మహబూబాబాద్ - తిరుపతిల మధ్య రద్దు చేశారు. (17201) గుంటూరు - సికింద్రాబాద్ మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలు డోర్నకల్ - సికింద్రాబాద్‌ల మధ్య రద్దు చేశారు. ఇదే కాకుండా మరి కొన్ని రైళ్లను దారి మళ్లించి నడిపిస్తున్నామని రైల్వే అధికారులు తెలిపారు.



వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

అవస్థ పడిన ప్రయాణికులు

వరంగల్ నగరంలో భారీ వర్షం కురుస్తుండడంతో ప్రయాణికులంతా నిలిచిపోయిన రైళ్లలోనే ఉండిపోయారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా వరంగల్ రైల్వేస్టేషన్ మేనేజర్ సారయ్య ఆధ్వర్యంలో సిబ్బంది ప్రయాణికులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అలాగే హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఎప్పటికప్పుడు రైళ్ల రాకపోకల సమాచారం అందజేశారు. వరంగల్-గుంటూరు మధ్య నడిచే ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేయడంతో మహబూబాబాద్, కేసముద్రం ప్రయాణికులు బస్సుల్లో వెళ్లారు. విజయవాడ, గుంటూరు ప్రయాణికులు పుష్‌పుల్ రైల్‌లో సికింద్రాబాద్‌కు తిరిగి వెళ్లారు. అలాగే ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ కాజీపేట, బీబీనగర్ మీదుగా దారి మళ్లించారు. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షంతో సాయంత్రం వరంగల్ రైల్వేస్టేషన్ పట్టాలపైకి వర్షం నీరు చేరుకుంది. అయితే రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలుగలేదు. రాత్రి 8.30 వరకు వరంగల్-విజయవాడ మార్గంలో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి.

వర్షాన్ని సైతం లెక్క చేయకుండా..

- యూరియా కోసం భారీగా తరలి వచ్చిన రైతులు
- పంపిణీ చేయని అధికారులు
- మహిళా రైతు గొలుసు చోరీ

బయ్యారం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో యూరియా పంపిణీ కేంద్రం వద్దకు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రైతులు బుధవారం భారీగా తరలివచ్చారు. అయితే మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షం కారణంగా పరిస్థితులు అనుకూలించకపోవడంతో అధికారులు యూరియా పంపిణీని నిలిపివేశారు. ఈ క్రమంలోనే యూరియా కోసం వచ్చిన ఓ మహిళా రైతుకు చెందిన బంగారు గొలుసు అపహరణకు గురైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పలపాడులో యూరియా పంపిణీ చేయనున్నారని తెలియడంతో రైతులు బుధవారం తెల్లవారుజామున పంపిణీ కేంద్రం వద్దకు భారీగా తరలివచ్చారు. భారీగా వర్షం కురుస్తుండటంతో గంటల కొద్ది గొడుగులతో క్యూలో నిల్చున్నారు. వర్షం ఎంతకు తగ్గుముఖం పట్టకపోవడంతో అధికారులు యూరియా పంపిణీని నిలుపుదల చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా యూరియా లారీని కూడా అక్కడి నుంచి పంపించడంతో పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఓ పక్క భారీ వర్షం కురుస్తుంటే యూరియా పంపిణీ ఉందని ఎలా సమాచారం ఇచ్చారని పలువురు రైతులు సిబ్బందితో వాగ్వాదానికి దిగగా గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే యూరియా కోసం వచ్చిన నర్సాతండాకు చెందిన మహిళా రైతు జ్యోతికి చెందిన బంగారు గొలుసు అపహరణకు గురైంది. అపహరణకు గురైన బంగారు గొలుసు సుమారు పది గ్రాముల బరవు ఉంటుందని సమాచారం. ఎంత వెతికినా గొలుసు కనపడకపోవడంతో ఆమె బోరున విలపించింది. యూరియా పంపిణీ విషయమై ఏవో రాజును వివరణ కోరగా తొలుత వాతావరణం పొడిగా ఉండటంతో రైతులకు సమాచారం ఇచ్చామని, అనంతరం భారీ వర్షం కారణంగా పంపిణీని నిలుపుదల చేసినట్లు తెలిపారు. యూరియాను బయ్యారం పీఏసీఎస్ సొసైటీ నందు నిల్వ చేసినట్లు వెల్లడించారు. వాతావరణం పొడిగా మారిన అనంతరం ఉప్పలపాడు రైతులకు యూరియాను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.



ఉప్పలపాడులో యూరియా కోసం వేచి చూస్తున్న రైతులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి
- అధికారులతో ఎంపీ కావ్య టెలి కాన్ఫరెన్స్

హనుమకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో వరంగల్, హనుమకొండ, జనగామ, భూపాలపల్లి జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ప్రజల భద్రతపై అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య సూచించారు. కలెక్టర్లు, రెవెన్యూ, పోలీసు, విద్యుత్, మున్సిపల్, పంచాయతీరాజ్, రోడ్డు భద్రత తదితర శాఖల అధికారులతో ఎంపీ కావ్య టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరే ప్రమాదం ఉన్న గ్రామాలు, కాలనీల ప్రజలను ముందుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, చెరువులు, వంతెనల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎంపీ సూచించారు. రైతుల పంటలకు నష్టం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, భారీ వర్షాల నేపథ్యంలో ఎవరూ చేపలు పట్టడానికి నీటి ప్రవాహం వైపు వెళ్లరాదని అన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు వెళ్లవద్దని, అత్యవసర సహాయార్థం అధికారులు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్లకు సంప్రదించాలన్నారు. వర్షాల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని సహాయక బృందాలను సిద్ధం చేయాలని, అవసరమైన ఆహార పదార్థాలు, వైద్య సహాయం, ట్రాన్స్‌పోర్టు ఏర్పాట్లపై దృష్టి పెట్టాలని కలెక్టర్లకు ఎంపీ కావ్య సలహా ఇచ్చారు. అన్ని శాఖల సమన్వయంతో వర్షాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

భారీ వర్షాలు.. తస్మాత్ జాగ్రత్త

అధికారులతో కలెక్టర్ స్నేహ శబరీష్ సమీక్ష

హనుమకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల పరిస్థితిపై జిల్లా అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో వరద పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొంథా తుఫాన్‌తో భారీ వర్షాలు ఉన్నందున అన్నిశాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ జిల్లాలోని వర్ష ప్రభావం స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. భారీవర్షాల వల్ల ఉత్పన్నమైన పరిస్థితులపై ప్రజలు అప్రమత్తం చేయాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టాలు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో వర్ష ప్రభావం, పరిస్థితి గురించి ఎప్పటికప్పుడు తెలియ చేయాలన్నారు. ఎడతెరిపి లేకుండా మరిన్ని రోజుల పాటు భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో అధికారులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి నష్టం వాటిల్ల కుండా చర్యలు చేపట్టాలన్నారు.

కేయూ అథ్లెటిక్స్ ఎంపికలు వాయిదా

కేయూ క్యాంపస్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని గురు, శుక్రవారాల్లో జరగాల్సిన అంతర్ కళాశాలల స్త్రీ, పురుషుల అథ్లెటిక్ క్రీడా పోటీలను తాత్కాలికంగా భారీవర్షాల నేపథ్యంలో వాయిదా వేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య బుధవారం తెలిపారు. ఆయా పోటీలను వర్షాల తగ్గాక నవంబరులో నిర్వహిస్తామని వెల్లడించారు.

తుఫాన్‌తో రైతులు నష్టపోవద్దు

అధికారులతో కలెక్టర్ దివాకర



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం వల్ల రానున్న రెండురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ రైతులు పంటలు నష్టపోకుండా చూడాలని కలెక్టర్ టీఎస్.దివాకర ఆదేశించారు. బుధవారం ఆయన తన చాంబర్ నుంచి అదనపు కలెక్టర్లు, జిల్లా, మండల స్థాయి అధికారులు, తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల రైతులు పంటలు నష్టపోకుండా అధికారులు సమన్వయంతో ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన వరి ధాన్యం నిల్వలతోపాటు ఆయా ప్రాంతాల్లో ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసి నష్టపోకుండా రైతులకు టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. తుఫాను గురించి రైతులకు తెలియజేస్తూ అప్రమత్తం చేయాలని, రానున్న రెండురోజులపాటు వరికోతలు జరుపకుండా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం పంపిన వెంటనే దిగుమతి చేసుకునేలా పర్యవేక్షణ జరపాలని, వెంటవెంటనే ట్రక్ షీట్లు తెప్పించుకుని ట్యాబ్‌లో ఎంట్రీ చేయించాలన్నారు. నీటిపారుదలశాఖ అధికారులు వారి పరిధిలోని చెరువులను నిత్యం పర్యవేక్షిస్తూ ఏదైనా అత్యవసర మరమ్మతులు ఉన్నట్లయితే యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలన్నారు. వర్షాల దృష్ట్యా తక్షణ సహాయం కోసం కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నంబర్ 18004257109కు కంట్రోల్‌రూంలో 24 గంటలపాటు అధికారులు, సిబ్బంది షిఫ్టులవారీగా అందుబాటులో ఉంటూ ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత శాఖల అధికారులను తక్షణ పరిష్కార నిమిత్తం పంపడం జరుగుతుందని అన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటించాలని, లోతట్టు ప్రాంతాలు, నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుడా అప్రమత్తతతో వ్యవహరించాలని, విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లోలెవల్ వంతెనాలు, కాజ్‌వేల మీదుగా వరద ప్రవాహనం ఉన్న సమయాల్లో రాకపోకలను నిషేధించాలని, చెరువులు, కాలువలు, నదులలో చేపలవేట, ఈతకోసం ఎవరూ వెళ్లకుండా కట్టడి చేయాలన్నారు. వర్షాల వల్ల చెరువులు, కాలువ కట్టలు తెగిపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. పురాతన, శిథిలావస్థకు చేరిన భవనాలు, ఇళ్లలో ఉంటున్న వారిని ఖాళీ చేయించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలన్నారు. అవసరమైన సమయంలో వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలన పునరావాస కేంద్రాలకు తరలించి ఆహారం, ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు. వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యఆరోగ్యశాఖ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. భూపాలపల్లి జిల్లా, నియోజకవర్గ ప్రజలు భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ మేరకు పోలీసులు, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖ, నీటిపారుదల శాఖ, విద్యుత్ తదితర శాఖల అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేసినట్లు తెలిపారు.

లోయర్ మానేరు డ్యామ్ సమీప ప్రజలు జాగ్రత్త

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భారీగా కురుస్తున్న వర్షాలతో లోయర్ మానేరు డ్యామ్ సమీప ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా సూపరిం టెండెంట్ ఇంజనీర్ పి.రమేష్ అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రకటన విడుదల చేశారు. లోయర్ మానేరు డ్యామ్ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, మిడ్ మానేరు రిజర్వాయర్ నుంచి వస్తున్న వరద డ్యామ్‌లోకి వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోందని తెలిపారు. ఇప్పటికే గరిష్ఠ స్థాయికి చేరు కున్నట్లు తెలిపారు. స్పిల్వే వరద గేట్లు ఎత్తి 4వేల కూ సెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్టు తెలిపారు. ప్రాజెక్టు దిగువన నది పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువుల కాపర్లు, జాలర్లు అటువైపు వెళ్లొద్దని పేర్కొన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

ములుగు టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం అన్ని ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలలకు సెలవు ఉంటుందని డీఈవో ఎ.సిద్ధార్థరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని పాఠశాలలకు ఈ సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు.

● భూపాలపల్లి టౌన్ (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో గురువారం జిల్లాలోని పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరి కలను పరిగణనలోకి తీసుకుని విద్యార్థులు, చిన్నారుల భద్రతా చర్యలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవరిస్తోందని తెలిపారు. అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది తమ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సమాచారం ఇవ్వాలని చెప్పారు.

అంతర్‌రాష్ట్ర సరిహద్దులో తనిఖీ కేంద్రం



తనిఖీ కేంద్రంలో అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్

వాజేడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకూరు గ్రామ సమీపంలో అంతర్‌రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రాన్ని ములుగు అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్‌జీ బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ములుగు జిల్లాకు ఆనుకొని ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వరి ధాన్యం జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు దళారులు తరలించి విక్రయిస్తున్నారని అన్నారు. ఆ రాష్ట్రం నుంచి వచ్చే ధాన్యం లారీలను జప్తు చేసి దళారులపై చర్యలు తీసుకునేందుకే తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరిస్తూ క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలన్నారు. ఆయన వెంట పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి షాఫైజల్ హుస్సేని, జిల్లా మేనేజర్ రాంపతి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలి

అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

మొగుళ్లపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందించాలని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె మండలకేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆమె డైనింగ్‌హాల్, స్టోర్‌రూంను పరిశీలించారు. మధ్యాహ్నం సమయంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశా రు. ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదువుకుని భవిష్యత్తులో ఉన్నతస్థానంలో ఉం డాలని సూచించారు. అనంతరం ఆమె ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో సురేందర్, ఎంజేపీ పాఠశాల ప్రిన్సిపాల్ శారద, పంచాయతీ కార్యదర్శి నరేష్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం

కాటారం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు బుధవారం ప్రారంభ మయ్యాయి. జీపీ పరిధిలో 29 ఇళ్లు మంజూరయ్యాయి. తొలి విడతలో గోపా ల్‌పూర్, దేవరాంపల్లి, ఎస్సీకాలనీలో 15ఇళ్లకు అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు ముగ్గు పోసి భూమిపూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జీపీ కార్యదర్శి కృష్ణవేణి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రజాప్రభుత్వ ధ్యేయం

ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల

కాటారం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే ధ్యేయంగా



సీసీఐ కేంద్రం ప్రారంభోత్సవంలో ఏఎంసీ పాలకవర్గం, అధికారులు

ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని కాటారం ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్య అన్నారు. మండలంలో రేగులగూడెం జీపీ పరిధిలోని రుద్ర జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాపు, సీసీఐ, మార్కెటింగ్ శాఖ అధికారులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుమల మాట్లాడుతూ పత్తిలో తేమ శాతంపై సీసీఐ కఠినంగా వ్యవహరించకుండా రైతులపై ఉదారత ప్రదర్శించి పత్తిని కొనుగోలు చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సీసీఐ ద్వారా పత్తి మద్దతు ధర క్వింటాలుకు రూ.8,110 చెల్లిస్తున్నారని, రైతులు నాణ్యమైన పత్తిని కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని విక్రయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంవో ప్రవీణ్ కుమార్, ఏఎంసీ కార్యదర్శి లా షరీఫ్, సీసీఐ సీపీవో ఇలంగోన్, ఏఎంసీ వైస్ చైర్మన్ చినాల బ్రహ్మారెడ్డి, డైరెక్టర్లు పిల్లమారి రమేష్, తిరుపతిరావు, శ్రీనివాస్, ఇర్షాద్, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, మిల్లర్లు సాగర్‌రెడ్డి, రవి, శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన

కృష్ణకాలనీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థినులకు మానవ అక్రమ రవాణా, మహిళా భద్రత, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, సైబర్ సెక్యూరిటీ సేవలపై అవగాహన కల్పించారు. షీటీమ్, భరోసా సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మహిళలు, విద్యార్థినులు ఒంటరిగా ప్రయాణించే సమ యంలో ఏదైనా సమస్యలు ఎదురైతే మౌనంగా ఉండకుండా షీటీమ్‌ను ఆశ్రయించాలన్నారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటిం చాలని అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అతి నమ్మకాన్ని ప్రదర్శించొద్దని సూచించారు. హెడ్ కానిస్టేబుల్ దేవేంద్ర, కానిస్టేబుల్ ఇర్ఫాన్, శ్రీనివాస్, భరోసా టీం సభ్యులు పాల్గొన్నారు.

'సింగరేణి జీఎంపై వ్యాఖ్యలు సరికావు'

కృష్ణకాలనీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణి జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డిపై బార్ అసోసియేషన్ చేసిన వ్యాఖ్యలు సరికావని ఐఎన్‌టీయూసీ నేతలు పసునూటి రాజేందర్, బేతెల్లి మధుకర్‌రెడ్డి, జోగ బుచ్చయ్య పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్రంలోని పైలట్‌కాలనీలో ఉన్న కమ్యూనిటీ హాలును కోర్టు బిల్డింగ్‌కు కేటాయించాలనే ప్రతిపాదన సరికాదని అభిప్రాయపడ్డారు. జిల్లా ఏర్పడ్డాక పదేళ్లుగా ఆ కమ్యూనిటీ హాలులో జిల్లా పోలీసు కార్యాలయం కొనసాగిందని, ఇటీవలే సింగరేణి ఆధీనంలోకి వెళ్లిందని తెలిపారు. మళ్లీ, కోర్టు బిల్డింగ్‌కు కేటాయించాలని డిమాండ్ చేయడం సరికాదని, కార్మికుల సంక్షేమం కొరకు ఏర్పాటు చేసిన హాలును కార్మికుల అవసరాలకే వినియోగిం చాలని డిమాండ్ చేశారు. కోర్టులపై, న్యాయస్థానాలపై, ప్రభుత ్వశాఖలపై జీఎంకు గౌరవం లేదని బార్ అసోసియేషన్ వ్యాఖ్యలు చేయడం హేయమని పేర్కొన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేయాలి

అధికారులతో భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఎఫ్‌ఏక్యూ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. బుధవారం ఐడీవోసీ కార్యాలయం సమావేశ మందిరంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై రెవెన్యూ, పౌరసరఫరాలు, పౌరసరఫరాల సంస్థ, వ్యవసాయ, సహకార, రవాణా, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలను, ఎఫ్‌ఏక్యూ నిబంధనలకు అనుసరించి ధాన్యం కొనుగోలు నిర్వహించాలని సూచించారు. ఈ సీజన్‌లో మొత్తం 44396 హెక్టార్లలో వరి పంట సాగు జరిగిందని తెలిపారు. సుమారు 1.52లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరే అవకాశం ఉన్న నేపథ్యంలో గత సంవత్సరం అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పకడ్బందీగా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని అన్నారు. నవంబరు మొదటి వారం నుంచి కోతలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలు ఎత్తైన ప్రదేశాలలో ఏర్పాటు చేసి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, పౌరసరఫరాల అధికారి కిరణ్‌కుమార్, డీఎం రాములు, సహకార అధికారి వాలియా నాయక్, వ్యవసాయ అధికారి బాబురావు, డీఆర్‌డీవో బాలకృష్ణ, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన పెంచాలి

కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలపై అవగాహన మరింత పెంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. భూపాలపల్లిలోని ఐడీవోసీ కార్యాలయంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికాంలకు ఉద్యాన దర్శిని పుస్తకాలను ఆయన అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులకు ఆధునిక పద్ధతులు, పంట సంరక్షణ, మార్కెట్ సౌకర్యాలు, రాయితీల వివరాలు క్షేత్రస్థాయిలో తెలియజేయాలన్నారు. ఉద్యాన దర్శిని పుస్తకంలోని సమాచారాన్ని గ్రామస్థాయికి చేర్చి రైతులను ప్రయోజన వంతులను చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఉద్యాన శాఖ జిల్లా అధికారి సునీల్ కుమార్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి బాపురావు, సహకార శాఖ జిల్లా అధి కారి వాలియా నాయక్, డీఆర్డీవో పీడీ బాలకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన కంటి పొర చికిత్స శిబిరం

ఏటూరునాగారం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సంజోష్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సినీ నటుడు సంజోష్ హరి, విజన్ ఇన్ఫోటెక్ ఫౌండర్ రాచపల్లి ఉపేంద్ర సహకారంతో మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో శంకర నేత్రాలయ, ఎంఈఎస్‌యూ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి శస్త్ర చికిత్స శిబిరం బుధవారం ముగిసింది. ముఖ్య అతిథిగా ఎస్పీ శబరీశ్ హాజరయ్యారు. ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్ర శస్త్ర చికిత్స శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. హీరో సంజోష్ తన సొంత ఊరి కోసం, జిల్లా ప్రజల కోసం చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. శిబిరంలో వారం రోజుల పాటుగా సేవలందించిన ఆశా వర్కర్లకు సంజోష్, ఉపేంద్ర కలిసి ఎస్పీ చేతుల మీదుగా రూ. 15 వేల చెక్కును అందజేశారు. శంకర్ నేత్రాలయ వైద్యులను ఎస్పీ శబరీశ్ సత్కరించారు. సంజోష్ మాట్లాడుతూ ఈ శిబిరం ద్వారా సుమారు వెయ్యి మందికి పైగా ప్రజలు కంటి పొర పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. వీరిలో 168 మందికి విజయవంతంగా కంటి పొర శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై నరిగా రాజ్‌కుమార్, సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న ఎస్పీ శబరీశ్

అమ్మ పేరుతో మొక్క నాటండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాకారులు

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): 'అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి' అనే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్ ఆధ్వర్యంలో బుధవారం భూపాలపల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళారంజని సందీప్ కళాబృందం ద్వారా సాంస్కృతి కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా కళాకారులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీం లీడర్ సందీప్, కరుణాకర్, లక్ష్మణ్, రజిని తదితరులు పాల్గొన్నారు.

దేవాదుల ప్రాజెక్టులో నీటి పంపింగ్ షురూ..

కన్నాయిగూడెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి నీటి పంపింగ్ ను పునఃప్రారంభించారు. వానాకాలం వర్షాలు సమృద్ధిగా కురువ డంతో ఆగస్టు మొదటి వారంలో దేవాదుల ఇన్‌టేక్ పంప్ హౌజ్ నుంచి నీటి ఎత్తి పోతలను పూర్తిగా నిలిపివేశారు. దాదాపు రెండున్నర నెలల తర్వాత బుధవారం పంపింగ్‌ను తిరిగి ప్రారంభించారు. ఫేజ్-3లో ఒక మోటారును ఆన్ చేసి 292 క్యూ సెక్కుల నీటిని జయశంకర్ భూపాలపల్లి జిల్లా భీంఘనపూర్ రిజర్వాయర్‌కు ఎత్తి పోస్తున్నారు. ఇదిలా ఉండగా తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువ నుంచి 1,15,698 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో బ్యారేజీ లోని మొత్తం 59 గేట్లు ఓపెన్ చేసి, ఎలాంటి నీటిని నిల్వ చేయకుండా ఫ్రీ ఫ్లోగా ఉంచారు. వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ వద్ద 74.25 మీటర్ల నీటి మట్టం నమోదైంది. దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 74.70 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు డీఈఈ జి.శరత్ బాబు తెలిపారు.

పీఈటీ పోస్టులు భర్తీ చేయాలి : డీవైఎఫ్ఐ

ములుగు టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలో పూర్తిస్థాయిలో పీఈటీ పోస్టులను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇన్‌చార్జి డీఈవో ఎ.సిద్ధార్థరెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కలువాల రవీందర్ మాట్లాడుతూ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు (పీఈటీలు) లేక విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పీఈటీ పోస్టులకు నోటిఫికేషన్‌లో కనీసం పది శాతం నియామకాలు కూడా పేర్కొనలేదన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు గొల్ల ప్రదీప్, రాజేందర్, ఇంజపెల్లి అనిల్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్లకు అందిన పారితోషికం

మంగపేట అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి) సమగ్ర కుటుంబ సర్వే వివరాలను నమోదు చేసిన డేటా ఎంట్రీ ఆపరేటర్లకు పారితోషికాలను బుధవారం అందాయని ఎంపీడీవో భద్రు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డేటా ఎంట్రీ ఆపరేటర్లకు పూర్తి నగదును అందజేసినట్లు వెల్లడించారు. దీంతో పది నెలలుగా పారితోషకాల కోసం ఎదురుచూస్తున్న ఆపరేటర్లకు ఎట్టకేలకు ఊరట కలిగింది.

ఐటీడీఏ ముట్టడిని విజయవంతం చేయాలి : ఆదివాసీ జేఏసీ

వెంకటాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నవంబరు 3న నిర్వహించే చలో ఏటూరునాగారం ఐటీడీఏ ముట్టడిని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకుడు పూనెం రాంచందర్ కోరారు. బుధవారం ఆయన మండలంలోని చొక్కాల, మల్లారం, కర్రవానిగుంపు, రాచపల్లి గ్రామాల్లో పర్యటించి ముట్టడి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఐటీడీఏ ముట్టడి కార్యక్రమానికి ఆదివాసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ఆదివాసీ ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

1న గుడిగుట్టలో మాలధారణ

వెంకటాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని అంకన్నగూడెంలో గుడిగుట్ట భక్తాంజనేయస్వామి దేవాలయంలో నవంబరు 1న మాలధారణ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు (గిరిజన పూజారి) యాసం నర్సింహారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మాల ధరించాలని ఆయన కోరారు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఏటూరునాగారం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ఇటీవల రూ. 8 కోట్ల 5 లక్షల (సీఆర్ఆర్ జనరల్ ఫండ్) నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క చిత్రపటానికి మండల కేంద్రంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం మంత్రి సీతక్క చేస్తున్న సేవలకు, కృషికి కృతజ్ఞతలు తెలిపారు. రోడ్ల మంజూరు వల్ల ఏజెన్సీ గ్రామీణ ప్రజలకు రవాణా సౌకర్యం సులభతరం అవుతుందని, తద్వారా ఆర్థిక, వ్యాపార వాణిజ్య, సామాజిక సమైకత్య పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింగరావు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్నఎల్లయ్య, మాజీ జడ్పీటీసీ ఎమ్డీ. వలియాబీ, జిల్లా యూత్ కార్యదర్శి ఎమ్డీ. గౌస్ పాషా తదితరులు పాల్గొన్నారు.